# 114. బాలకృష్ణ భాషావేశం

నేను ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పుడు నాకు బాలకృష్ణతో కంబైండు స్టడీ చేసే "అవకాశం" వొచ్చింది. "అవకాశం" అని స్పెషలుగా చెప్పడం ఎందుకంటేనూ; దాని వెనకాతల చిన్న కథ ఉంది. ఈ బాలకృష్ణ అనే అబ్బాయి నాకు థరుడు ఫారం నుంచీ క్లాస్‌మేటే గాని సంవత్సరాంతపు పరీక్షల్లో ఎప్పుడూ కూడా వాడికి బొటాబొటీగానే వొచ్చేవి మార్కులు. నేనేదో క్లాసుఫస్టూ స్కూలు ఫస్టూగా రాకపోయినా ఏ సబ్జక్టులో చూసినా నాకు బాలకృష్ణ కంటే పదేసి మార్కులు ఎక్కువ వచ్చేవి. "మెట్టు" (మెట్రిక్యులేషన్‌కి హ్రస్వరూపం) ఎలాగో దాటిన బాలకృష్ణ ఇంటర్మీడియట్‌లో దూడెయ్యకుండా ఉండాలంటే వాడికి ఎవడినయినా కంబైండు స్టడీమేట్‌ని తగిలించేడమే మార్గం అని బాలకృష్ణ తండ్రిగారైన సత్యనారాయణగారు భావించినట్టుంది. ఈ సత్యనారాయణగారు అప్పట్లో పి.డబ్ల్యుడి. ఆఫీసులో హెడ్ గుమాస్తాగా ఉండేవారు. వాళ్లు ఉండేది అద్దె ఇల్లే అయినా, వాళ్లింట్లో కరెంటు దీపాలుండేవి. ఆయన ఓనాడు మా నాన్నగారికి కబురు పెట్టి; "మీ కుర్రాడు బాగా చదవాలంటే ఆ కిరసనాయిలు దీపాల దగ్గిర కాకుండా ఎలెక్ట్రికులైటు దగ్గర చదవాలయ్యా". అన్నారుట. దానికి మా నాన్నగారేమోనూ "మావాడు కిరసనాయిలు దీపం దగ్గర చదవడు; ఎందుకంటే మా ఇంటి దగ్గిరే ఎలెక్ట్రిక్ పోలుంది; దానికో బల్బూ ఉన్నాది; మావాడు వీథి గుమ్మంలో కూచుంటే ఆ లైటు వెల్తురు వాడు చదువుకోడానికి సరిపోతుంది"- అన్నారట. దానికి ఆయనేమో వీథి లైటు దగ్గర వెల్తురు సరిపోయినా వాడు చదువుకుంటున్నప్పుడు వీథంట పోయే మనుషుల్ని చూస్తూ కొంత టైమ్ వృధా చేసుకుంటాడు; అలాంటప్పుడు ఏకాగ్రత కుదరదు కదా?" అన్నారుట. "మరేం చేస్తాం; ఒక లాభం ఉన్నచోట ఒక నష్టం తప్పదు కదా!" అని మా నాన్నగారన్నారుట. "అదికాదు; మీ వాణ్ణి ప్రతిరోజూ రాత్రి అన్నం తినగానే మా ఇంటికొచ్చేమను; తెల్లవార్లూ కాకపోయినా ఏ పదకొండు పన్నెండు గంటల వరకూనో మావాడితో కలిసి చదువుకుంటాడు; మా ఇంట్లో ఎలెక్ట్రిక్ లైట్లున్నాయి కదా. ఇంచక్కా వాళ్లిద్దరూ వీథంట పోయే వాళ్లని చూడకుండా ఏకాగ్రంగా చదువుకుంటారు" అన్నారాయన. "అలా అయినా, ఏసినీమా పాట గురించో, మేష్టర్ల గురించో, తోటి స్టూడెంట్స్ గురించో మధ్య మధ్య హస్కు వేస్తారు; అంచేత మీరంటున్న ఏకాగ్రత కుదరదేమో నండీ." అని మా నాన్నగారు నసిగినా; సత్యనారాయణ గారి స్థితిగతులు మా నాన్నగారి స్థితిగతుల కంటే బాగా మెరుగుగా ఉండడం వల్ల నాకు బాలకృష్ణతో కంబైండు స్టడీ తప్పనిసరిగా కుదిరిపోయింది.

బాలక్రిష్ణకీ నాకూ క్లాసు పాఠాలు-అనే "ముఖ్య సామాన్య అభిరుచి" ఉన్నా; మా నాన్నగారు ఉదహరించిన సినీమా పాటలు-అనే "ఇష్ట సామాన్య అభిరుచి" కూడా ఉంది. భానుమతి పాటలు భానుమతి గొంతుని అనుకరించి పాడ్డం నాకు పట్టుబడింది. బాలకృష్ణకి 'హార్మణీ' వాయించడం కొద్ది కొద్దిగానైనా వచ్చేది. ఇంట్లో హార్మణీ ఉండేది కూడాను. (బాలకృష్ణ అక్క పెళ్లి కాకముందు ఆ హార్మణీ మీద సంగీతం నేర్చుకుంది గాని; వాళ్ల బావగారు ఆమెని కాపరానికి తీసికెళ్లేటప్పుడు "ఈ హార్మణీ పెట్టె తీసుకురావడానికి వీల్లే"దని కండిషన్ పెట్టడం వల్ల ఆ హార్మణీ పెట్టె ఇక్కడే ఉండిపోయింది.) అంచేత, సత్యనారాయణ గారు ఇంజినీర్లతోనూ కాంట్రాక్టర్లతోనూ వ్యవహారాలు పూర్తిచేసుకుని ఇంటికి చేరే సమయం (రాత్రి ఎనిమిదిన్నర పైమాటే) వరకూ, బాలక్రిష్ణ తల్లిగారైన

అన్నపూర్ణమ్మ గారు నెత్తీ నోరూ మొత్తుకుంటున్నాసరే నేనూ బాలక్రిష్ణా హార్మణీకి ఇటూ అటూ కూచునే గడిపేవాళ్లం. (హార్మణీ మొత్తుకుంటూ వాడూ, నోరు మొత్తుకుంటూ నేనూ)

సినిమా పాటల సంగతి అలా ఉంచగా, బాలకృష్ణకి అప్పటికే తులనాత్మక భాషా పరిజ్ఞానం ఒకటి ఉండేది. వాడు ఎస్సెల్సీ పరీక్షలు రాయడం అయిపోగానే మద్రాసులో ఉన్న వాళ్లక్కయ్య గారింటికి వెళ్లి ఎండాకాలం సెలవులన్నీ గడిపేడు. అక్కడ వాళ్లున్న ఇంట్లో ఇరుగు వాళ్లు తమిళులు, పొరుగు వాళ్లు హిందీ వాళ్లు; మేడ మీద రెండు వాటాల్లో కన్నడిగులు, మలయాళీలూనట. అంచేత వాడు మద్రాసులో ఉన్న డెబ్బయి రోజుల్లో నాలుగు భాషలూ కొద్దికొద్దిగా నేర్చేసుకుని, అంతకి ముందు (అంతంత మాత్రంగా తెలిసిన) ఇంగ్లీషూ తెలుగూతో కలుపుకుని మొత్తం ఆరు భాషలు నేర్చినవాడుగా తయారయ్యేడు. దేవీ విలాస్ కాఫీ క్లబ్బుకి వెళ్లినపుడు "మూణిడ్లీ సూడా; ముళహోప్పొడి" అనీ, గంట స్తంభం దగ్గిర కాకాహోటలు కెళ్లినప్పుడు "దో చాయ్‌లా!" అనీ ఆర్డర్లెయ్యడం నేర్చాడు.

ఓరోజు ఉదయం పూట మేం ఇద్దరం ట్రిగ్నామెట్రీ ప్రాబ్లెంస్‌తో కుస్తీ పడుతూ ఉండగా, బైటినుంచి "అమ్మా, అన్నపూర్ణేశ్వరీ!" అని కేక వినపడింది. బాలకృష్ణ కిటికీలోంచి కొద్దిగా తొంగిచూసి, "ముష్టివాడు. చూడు; మా అమ్మని పేరుపెట్టి మరీ పిలుస్తున్నాడు!" అని నాతో అన్నాడు. అటు తిరిగి, "యా రంగె?" అని కేకపెట్టేడు. "ఇప్పుడుచూడు, నా ప్రజ్ఞ!" అన్నట్టు నా వేపు చూసేడు. "ఎవరక్కడ?" అని ఆ కేకకి తమిళంలో అర్థం. అవతలివాడు (ముష్టివాడే అయినా) వీళ్లతో మనకెందుకు; మరో ఇంటికి పోదాం అనుకోవాలని బాలకృష్ణ ఉద్దేశం.

అంతే. మేం చదువుకుంటున్న వీధి కొట్టు తలుపులు భడీమని తెరుచుకుని ఆ ముష్టివాడు లోపలికొచ్చేశాడు. వాడి మొహం చాటంతయింది; "నాందా, సామీ! నాన్ కుంబకోణం లిరింది వందాచ్చి. మూణు దినంగళి రింది సాప్పడి రిత్తిక్కి ఒణ్ణుంకిడి యిలె-" అలా ఏదోఅంటూ గుక్క తిప్పు కోకుండా (మమ్మల్ని కూడా తిప్పుకోనియ్యకుండా) పావుగంట సేపు వాడి ఆత్మకథను పటిష్టమైన "అ-రవ" భాషలో వివరించేశాడు. దాంతో బాలకృష్ణ లోపలికెళ్లి తవ్వెడు బియ్యం తెచ్చి వాడి జోల్లో పోసేసి వాణ్ణి వదలగొట్టుకోవలసి వచ్చింది. (సమయానికి అన్నపూర్ణమ్మగారు స్నానాల గదిలో ఉండడం వల్ల "మాతృ"భాషలో చీవాట్లు తప్పేయి.)

మళ్లీ చాలారోజుల తరవాత బాలకృష్ణా నేనూ విజయనగరం నుంచి హైదరాబాదు ప్రయాణం చేస్తూ ఒక కంపార్ట్‌మెంట్‌లో కలిశాం. "హైదరాబాద్‌లో అంతా ఉర్దూ మాట్లాడుతారుట. ఎలాగో ఏమిటో" అని నేను బెంగగా అన్నాను. "మనకి ఆ బాధలేదు. ఉర్దూ అంటే నాకేం భయం లేదు. ఆఫ్టరాల్ ఉర్దూ హిందీ రెండూ వొక్కటే. నీకు తెలుసో లేదో; హిందీ అనే భాష ఉంది చూసేవూ. అది సంస్కృతం నుంచి లిపీ, ఉర్దూలోంచి మాటలూ ఎరువు తెచ్చుకొని మొత్తం భారత దేశానికి ముఖ్యమైన భాషగా స్థిరపడ్డాది" అన్నాడు బాలకృష్ణ. "నాకోసం పి.డబ్ల్యు.డి. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గారి కారొస్తుంది. నిన్ను మీ తమ్ముడింట్లో దిగబెట్టేస్తాను. నువ్వు ఆటో వాళ్ళ ఉర్దూకి భయపడక్కర్లేదు" అని నాకు ధైర్యం చెప్పేడు. కారు నెంబరు పెద్దపెద్ద అంకెల్లో రాసున్న ఓ అట్ట మెళ్లో వేళ్లాడ గట్టుకుని స్టేషన్‌కి వస్తాట్ట డ్రైవరు.

రైలు దిగిన కొంతసేపటికి "అట్టవాడు" కనబడ్డాడు. "మైహూం బాల్‌కృష్ణా. క్యానామ్ హైతుమారా?" అని బాలకృష్ణ అతన్ని పలకరించేడు. "అదేటండి బాబూ, అలగ మాటాడతన్రు?



IB

నాపేరు సివంచెలమండీ, తమురు ఇజానారంనించే గదండి, ఒస్త్రను? తముర్ని ఇంత గుంటడప్పుడు కాణ్ణించి ఎరుగుదునండి, నాను, నన్నే పొల్తి పట్నేదా?" అని "అట్టవాడు" దడదడలాడించే సరికి బాలకృష్ణ "ఊఁ ఊఁ, పద, పద" అని నన్ను ముందుకి తోసేడు.

కల్చరల్ ఎక్స్ఛేంజి ప్రోగ్రాం కింద బాలకృష్ణకి రష్యా వెళ్లే ఛాన్సు తగిలింది. "నీకు ఎన్నో భాషలు వచ్చుగాని, రష్యన్ భాషరాదు కదా; ఎలా అవస్థపడతావో?" అన్నాను. "నేనెందుకు అవస్థపడతానూ? అవస్థలేవో వాళ్లేపడతారు. ఆకలేస్తే కడుపు మీద అరచేత్తో కొట్టుకుంటాను. దాహం వేస్తే నోరు తెరిచి బొటకనవేలు ఆడిస్తాను. డబ్బు కావాలంటే చూపుడువేలు మీద బొటకనవేల్తో చిటితాళం వేస్తాను" అని ఏం అవసరాలకి ఏయే సంజ్ఞలో సాంగికంగా చెప్పేడు.

అయినా సరే; రష్యావాళ్లు, పాపం, ఈబాలకృష్ణతో ఏం అవస్థలు పడుతున్నారో అని నాకు బెంగగానే ఉంది.

★

# 115. ప్రకటనా ప్రియుడు

ఎవరు రాసేరో గుర్తులేదు కాని, నాలాంటి వాళ్లకు చెంపపెట్టు లాంటి వాక్యం అది.

"ఎంత గొప్పవాడైనా కానీ; 'నా చిన్నతనంలో ఒకసారి' - అని మొదలెట్టేడంటే వాణ్ణి భరించడం మహాకష్టం"-అని; ఆ వాక్యం. "నో స్టాల్జియా ఈజ్ ఎ పిట్" అని ఇంగ్లీషులో కూడా ఎవరో అన్నారు. దాని అర్థం కూడా ఇంచుమించు ఇదే కావచ్చు. అయితే మాత్రం ఏమీ; వయసు చేత పెద్ద అయిన వాళ్లు కొందరు; వినేవాళ్లంటూ ఎవరయినా దొరికితే వాళ్ల చిన్ననాటి ముచ్చట్లు తమకంటే చిన్నవాళ్లకి చెప్పడం; అవతలి వింటున్న వాళ్లు ఎంజాయి చేస్తున్నారా లేదా అన్న సంగతి పట్టించుకోకుండా చెప్పే వాళ్లు ఎంజాయి చేసుకుపోతూ వుండడం చాలా సాధారణం.

ఎవరో వేళాకోళం చేసేరు కదా అని కూడా ఎవ్వరూ తమ చిన్నతనం నాటి ఉదంతాలు తరవాతి తరంవాళ్లకో, వినడానికి సిద్ధంగా ఉన్నవాళ్లకో చెప్పడం మానరని నాకు అనిపిస్తూ వుంటుంది. చిన్ననాటి ముచ్చట్లు చెప్పేటప్పుడు నిజమూ కల్పనా కలగలుపుగా వచ్చేసి; చెప్పేవాళ్ళ కల్పనా శక్తిని అనుసరించి ఆయా ముచ్చట్లకి కావ్య గౌరవం ఒనగూడడం కూడా వుందని కొంచెం సరదాగా, కొంచెం సీరియస్‌గా ఒప్పుకోవచ్చు.

నిడుదవోలు వేంకటరావు గారని ఒక కవిపండితుడు ఉండేవారు. వారి పుత్రులలో ఇద్దరు నాకు ఎస్సెల్సీలో క్లాసుమేట్సు. నలభై అయిదేళ్ళ కిందట, ఇంటర్మీడియెట్‌తో జగ్గారావు, ఎస్సెల్సీతో పార్వతీశ్వరరావూ చదువు ఆపేసి ఏర్‌ఫోర్సులో చేరిపోయారు. ఆ తరవాత వాళ్లెక్కడెక్కడ ఉద్యోగాలు చేసి ఎంతెంతవాళ్లు అయ్యారో తెలియలేదు. అయితే కిందటి నెలలో నేను హైదరాబాదుకి ఒకానొక వైద్యం కోసం వెళ్లి కొన్నాళ్లు గడిపినప్పుడు మా తమ్ముడు; జగ్గారావు అనే అతని ఫోన్ నెంబరు నాకు చెప్పేడు. చిన్ననాటి ముచ్చట్లు చెప్పి విసుగెత్తించే ఉద్దేశంతో కాక, నలభై ఐదేళ్ల తరవాత అతనెలా ఉంటాడో చూడాలన్న కుతూహలంతో నేను ఆ నెంబరు పిలిచేను. అంతే, జగ్గారావు "ఆఘమేఘాల మీద" అని చెప్పదగిన విధంగా కారుమీద, రోడ్డు మీద ప్రయాణం చేసి నేను ఉన్నచోటికి వచ్చి నన్ను వాళ్లింటికి తీసికెళ్ళేడు. నా క్లాస్మేట్ అయిన తన అన్నగారు పార్వతీశ్వరరావునే కాక;ఇంకా పెద్దన్నయ్య సుందరేశ్వరరావు గార్ని కూడా తన ఇంటికి రప్పించేడు.